క్లుప్తంగా

కత్తిపూడిలో ట్రాఫిక్ నిలిపివేత

శంఖవరం: ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో పిఠాపురం, గొల్లప్రోలు జాతీయ రహదారిపై భారీగా వరదనీరు చేరింది. అప్రమత్తమైన అధికారులు మంగళవారం సాయంత్రం 216వ నంబరు జాతీయ రహదారిపై కత్తిపూడి వద్ద ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ప్రత్తిపాడు సీఐ బి. సూర్యఅప్పారావు, అన్నవరం ఎస్సై వీ కిషోర్ పర్యవేక్షణలో బారికేడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి వాహనాలను అదుపు చేస్తున్నారు. వరదనీటి ఉధృతి తగ్గే వరకూ ప్రయాణికులు, ప్రజలను రాకపోకలు సాగించకూడదని సూచిస్తున్నారు.

పులిహోర పొట్లాల పంపిణీ


హైవేపై ప్రయాణికులకు పులిహోర పంపిణీ చేస్తున్న మనం ఫౌండేషన్ చైర్మన్ లత

ఏలేశ్వరం: జాతీయ రహదారిపై మండలంలోని చిన్నింపేట వద్ద ప్రయాణికులకు మంగళవారం ఉచితంగా పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు. మనం ఫౌండేషన్ చైర్మన్ మానూరి లక్ష్మీనాగగౌరీలత ఆధ్వర్యంలో వాహనాల్లో ప్రయాణించే వారికి పులిహోర పొట్లాలు అందజేశారు. వరదల నేపథ్యంలో జాతీయ రహదారి మీదుగా హోటళ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పులిహోర పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ధనేకుల వీరభద్రరావు, వెలుగూరి హరేరామ్, మజ్జూరి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

తొండంగి: మండలంలోని రావికంపాడు, ఏవీ నగరం గ్రామాల్లో మంగళవారం వంట గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. తొండంగి వైష్ణోదేవి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన కళాకారులు వీర్నాల కృష్ణ, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాకారుడు వీర్నాల ప్రకాష్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి


అచ్చంపేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

శంఖవరం: వరిలో తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లి, అచ్చంపేట గ్రామాల్లో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకు ముడత పురుగు వరిపంటను ఆశిస్తే తాడు లేదా ముల్ల కంపతో లాగడం వలన లార్వాలు, గుడ్లు నీటిలో పడి చనిపోతాయన్నారు. ముడత పురుగు ఉన్న సమయంలో యూరియా వేయడం ఆపాలన్నారు. గట్లపై కలుపు ఉండకుండా చూడాలన్నారు. అనంతరం నీమాస్త్రం పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు క్రాంతి, శ్రావణి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా నిరసన

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని రాచపల్లి, శాంతిఆశ్రమం, పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ జీఓతో తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందన్నారు. కోవిడ్ విపత్కర సమయంలో తమ జీవితాలను పణంగా పెట్టి వైద్య సేవలు అందించామన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా తాము సమ్మెకు దిగినట్లు తెలిపారు.

జీఓ నంబర్ 115ను రద్దు చేయాలి

రౌతులపూడి: ప్రభుత్వం అమలు చేస్తున్న జీఓ నంబర్ 115 రద్దు చేసి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సీహెచ్‌సీ స్టాఫ్‌నర్సులు డిమాండు చేశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు నర్సులను రెగ్యులర్ చేయాలని, నెల జీతాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో మంగళవారం రౌతులపూడి సీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. తక్షణమే సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకొని తమ న్యాయమైన డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని కోరారు. హెడ్‌నర్సు సరస్వతీ, స్టాఫ్‌నర్సులు సుజాత, నలినిసింగ్, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


రామవరం వద్ద పొలాల్లో నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలిస్తున్న జగ్గంపేట ఏఓ శ్రీరామ్


రాజుపాలెం-కిర్లంపూడి రహదారిపై వరద నీటిలో అవస్థలు

వరదలు.. అన్నదాత కుదేలు

- పంట పొలాలను ముంచెత్తిన వరదనీరు
- 3425 హెక్టార్లలో నీట మునిగిన పంటలు
- గగ్గోలు పెడుతున్న రైతులు
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు


జిల్లేడుపాడు పంట పొలాలను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఏడీఏ బుల్లిబాబు


భూపాలపట్నంలో ట్రాక్టర్‌పై పర్యటిస్తున్న తోట నరసింహం, నాయకులు

తుని రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదలు అన్నదాతను నిండా ముంచాయి. వర్షాలకు ఏలేరు, పంపా, తాండవ జలాశయాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో వేల ఎకరాలు నీట మునిగాయి. దీంతో మెట్ట రైతులు సైతం గగ్గోలు పెడుతున్నారు.

తుని సబ్‌డివిజన్‌లో...

వ్యవసాయ శాఖ తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో 6643 మంది రైతులకు చెందిన 3425 హెక్టార్లలో వరి, పత్తి పంటలు వరదనీటి ముంపునకు గురైనట్టు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సుంకర బుల్లిబాబు తెలిపారు. 2169 హెక్టార్లలో వరి, 256 హెక్టార్లలో పత్తి పంటలు దెబ్బతిన్నట్లు చెప్పారు. మంగళవారం తుని మండలం హంసవరం, జిల్లేడుపాడు, తొండంగి మండలాల్లో వరద నీటి ముంపునకు గురైన పంటలను, ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలను పరిశీలించారు. తుని మండలంలో 14 గ్రామాల పరిధిలో 747 మంది రైతులకు చెందిన 421 హెక్టార్లలో వరి, పత్తి పంటలు నీటి మునిగాయన్నారు. తొండంగి మండలంలో 19 గ్రామాల పరిధిలో 4027 మంది రైతులకు చెందిన 2161 హెక్టార్లలో వరి, పత్తి, కోటనందూరు మండలంలోని ఏడు గ్రామాల పరిధిలో 324 మంది రైతులకు చెందిన 227 హెక్టార్లలో వరి పంట నీటి మునిగిందన్నారు. రౌతులపూడి మండలంలో పది గ్రామాల పరిధిలో 1447 మంది రైతులకు చెందిన 569 హెక్టార్లలో వరి, పత్తి పంటలు ముంపునకు గురయ్యాయన్నారు. శంఖవరం మండలంలో ఆరు గ్రామాల పరిధిలో 98 మంది రైతులకు చెందిన 47 హెక్టార్లలో వరి, పత్తి పంటలు నీట మునిగినట్టు ఏడీఏ వివరించారు. తాండవ, పంపా, ఏలేరు రిజర్వాయర్ల నుంచి విడుదలైన అదనపు జలాలతో పుష్కర, పీబీసీ కాలువలు పొంగి పొర్లడంతో పంటలు నీట మునిగాయన్నారు. వరదనీటి ప్రవాహం తగ్గిన తర్వాత పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనా వేస్తామని చెప్పారు.

400 ఎకరాల్లో పంట నష్టం

జగ్గంపేట: మండలంలోని రామవరం, కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల్లో 400 ఎకరాల్లో పంటలు ముంపునకు గురైనట్టు మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. కిర్లంపూడి మండలం క్రిష్ణవరం నుంచి ఏలేరు వరద నీరు కండి కాలువ ద్వారా వరి పొలాలను ముంచెత్తిందని చెప్పారు. తిమ్మాపురం బెడ్ రెగ్యులేటర్ వద్ద జగ్గంపేట కాలువ గేట్లు మూసివేయడంతో ఏలేరు వరద కండి కాలువలోకి రాదని అధికారులు భావించారు. కాని ఏలేరు వరద ఉధృతి ఎక్కువగా ఉండటం, పుష్కర కాలువ నీరు, ఏలేరు వరదనీరు కండి కాలువలోకి రావడంతో మూడు అడుగుల నీరు రామవరం గ్రామ శివారులో పొలాలపై నుంచి ప్రవహిస్తోందని రైతులు తెలిపారు. రూ.వేలల్లో పెట్టుబడిలు పెట్టి సాగు చేసిన వరి పంట మొత్తం దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే వరుపుల

ఏలేశ్వరం: మండలంలోని వరద ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ మంగళవారం పర్యటించారు. పట్టణంలోని ఏలేరు కాలువపై వంతెన, ఏలేరు ప్రాజెక్టును, తిమ్మరాజుచెరువును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏలేరు ప్రాజెక్టు పరిస్థితిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రత్తిపాడు రూరల్: మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నీటి మునిగిన పంట పొలాలను మంగళవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరిశీలించారు. మండలంలోని ఇ.గోకవరంలోని సుబ్బారెడ్డి సాగర్ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టును, వేములపాలెం-పెద్దిపాలెం మధ్య వంతెనపై ఏటికాలువ ఉధృతిని, సుద్దగెడ్డ వాగు ప్రవాహాన్ని ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పి.జగన్నాథపురంలో వర్షాలకు గండి పడిన ఏటి కాలువను, నీట మునిగిన పంటలను అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. వరదలకు పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు.

ముంపు గ్రామాల్లో పర్యటించిన తోట నరసింహం

కిర్లంపూడి: మండలంలోని వరద ముంపు గ్రామాలను వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం మంగళవారం సందర్శించారు. రాజుపాలెం, ముక్కొల్లు, భూపాలపట్నం, శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, వీరవరం గ్రామాలను వరద నీరు ముంచెత్తడంతో ట్రాక్టర్‌పై వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముంపు గ్రామాల్లో ఇళ్లకే పరిమితమైన వాళ్ల దగ్గరకు యువ నాయకుడు తోట రాంజీ వెళ్లి ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారిని పలకరించారు. ధన, ప్రాణ నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తోట నరసింహం కోరారు. ఆయన వెంట తోట బాబ్జీ పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ఏలేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

10,450 ఎకరాల్లో నీట మునిగిన పంటలు

కిర్లంపూడి: మండలంలోని వరద నీటి ఉధృతికి సుమారు 10,450 ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో రాజుపాలెం, ముక్కొల్లు, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, వీరవరం, ఎస్.తిమ్మాపురం గ్రామాలను వరద ముంచెత్తింది. ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే గడిపారు. వరద ఉధృతి మరింత పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు విపత్తు బృందాలను, పడవలను సిద్ధం చేశారు. రాజుపాలెం, కిర్లంపూడి ప్రధాన రహదారిపై మంగళవారం ఉదయం కూడా వరద నీరు ఉధృతంగా పారడంతో రాకపోకలు నిలిపివేశారు. కాకినాడ నుంచి ప్రత్తిపాడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ముంపు గ్రామాల ప్రజలకు ఎగువ ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ గ్రామస్తులు వెళ్లేందుకు మక్కువ చూపలేదు. దీంతో అధికారులు ట్రాక్టర్లపై వెళ్లి ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. మంగళవారం సాయంత్రానికి అవుట్ ఫ్లో తగ్గడంతో గ్రామస్తులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ముంపు గ్రామాలను జేసీ రాహుల్ మీనా, పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు పరిశీలించారు. మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు.

వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటన

తుని రూరల్: మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన హంసవరం, జిల్లేడుపాడు, హెచ్.కొత్తూరు, టి.తిమ్మాపురంలో మంగళవారం తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ పి.రవికుమార్ వేర్వేరుగా పర్యటించారు. పంపా వరద నీటి ప్రభావంతో జిల్లేడుపాడు, కృష్ణాపురం, టి.తిమ్మాపురం, వలసపాకల మధ్య రహదారులపై ప్రవహిస్తున్న వరదనీటి ఉధృతిని పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆయా గ్రామాల్లో ముంపు బెడద తప్పింది. వారంరోజులు కురిసిన వర్షాల ప్రభావంతో నెలకొన్న వరదల ప్రభావానికి ప్రాణ నష్టం జరగలేదని, జన జీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేవని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాలువల్లో పూడికలు తొలగించాలని పంచాయతీ కార్యదర్శులను, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనావేయాలని వీఆర్వోలను ఆదేశించారు. జిల్లేడుపాడులో పూడికలు తొలగించామని, హంసవరంలో పూడిక తీతలు చేపట్టినట్టు కార్యదర్శి ఈ.శంకర్ తెలిపారు.

పంట నష్టాన్ని అంచనా వేస్తాం


పెద్దనాపల్లిలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఎంపీపీ బుజ్జి, అధికారులు


యర్రవరంలో పంట పొలాలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

ఏలేశ్వరం: వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పంట నష్టాన్ని అంచనా వేస్తామని జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని యర్రవరంలో మంగళవారం నీట మునిగిన పంటపొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తరువాత తమ సిబ్బంది పంట పొలాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తారన్నారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట ఏఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

ఏలేశ్వరం: భారీ వర్షాలు, వరదలకు నీట మునిగిన పంట పొలాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో మండలంలోని పెద్దనాపల్లిలో సుమారు వంద ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. పెద్దనాపల్లి, కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామాల సరిహద్దు పొలాలు మునిగిపోవడంతో అధికారులు పరిశీలించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జితో కలిసి తహసీల్దార్ వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి పొలాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: మండలాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పంటనష్టం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోగాలు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల అందుబాటులో ఉండడం లేదని, ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వీఏఏలను అక్రమంగా తొలగించి వారి పొట్ట కొట్టారని కొందరు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. రైతుల డిమాండ్‌కు తగినట్లుగా ఎరువుల ఇండెంట్ పెట్టినట్లు వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ప్రోటోకాల్ విషయంలో తగు చర్యలు తీసుకుంటామని అధికారులు వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ టి.శుభాష్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


భవితకు బాటలు వేసుకోవాలి

తుని రూరల్: విద్యార్థులు నూతన విద్యా విధానాలు, అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత సూచించారు. మండలంలోని వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ (అటానమస్) కళాశాలలో మంగళవారం స్టూడెంట్స్ ఇన్‌డక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నియమ నిబంధనలు, క్రమశిక్షణా అంశాలు, ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలు, కళాశాల కార్యాలయ సేవలు, కళాశాల సహాయ సంఘాల కార్యాచరణ, పరీక్షా విధానం, బ్రిడ్జ్ కోర్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, నూతన విద్యా విధానాలు, తదితర అంశాలను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసు, ఐఆర్‌ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.పుష్పావతి, అకడమిక్ కోఆర్డినేటర్ ఎస్.ఇందిరా ప్రియాంక, అధ్యాపకులు బి.నాగరాజు పాల్గొన్నారు.

13న నెక్ సెంటర్‌లో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక సీబీఎం సెంటర్‌లో ఉన్న నెక్ సెంటర్‌లో ఈనెల 13వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నెక్ జిల్లా అధికారి డి.హరిశేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 600 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బెల్, అపోలో ఫార్మసీ, దక్కన్ ఫైనాన్సు కెమికల్, ఎస్‌కే సేఫ్టీ వింగ్‌లో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డీగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు బయోడెటా, గుర్తింపు కార్డు, తమ సర్టిఫికెట్లతో ఆరోజు ఉదయం 10 గంటకు హాజరు కావాలన్నారు. జీతం రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ ఉంటుంద న్నారు. మరిన్ని వివరాలకు 94407 56250, 99491 56583 నవంబర్లకు సంప్రదించాలన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి


గోకవరంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

గోకవరం: క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు సూచించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ క్యాన్సర్‌పై రాష్ట్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం డెల్టా హాస్పటల్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, పర్యావరణ కాలుష్యం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్ల వలన ఎక్కువగా క్యాన్సర్ వస్తుందన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం అవుతుందన్నారు. అనంతరం గ్రామంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, గోకవరం మండలాధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా కోశాధికారి ఎమ్.జితేంద్ర, మండల కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి డి.నాగార్జున పాల్గొన్నారు.

ముంపు ఫుల్.. రాకపోకలు నిల్

- నీట మునిగిన రైల్వే అండర్ పాస్
- రెండేళ్లకే లీకేజీలు
- వాహన చోదకులకు ఇబ్బందులు
- రూ.కోట్లు దండుకున్న కాంట్రాక్టర్


తాళ్లూరు రైల్వే అండర్ పాస్‌లోకి చేరిన వర్షం నీరు

తుని: పట్టణంలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ కొద్ది పాటి వర్షాలకే ముంపు బారిన పడుతోంది. దీని నిర్మాణానికి రూ.10 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారు. అండర్ పాస్ నిర్మాణాన్ని ఓ బడా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. తునితో పాటు కాకినాడ, అనకాపల్లి జిల్లాల పరిధిలో పలు ప్రాజెక్టులను ఆయన దక్కించుకున్నారు. రైల్వేశాఖలోని లోసుగుల కారణంగా బడా కాంట్రాక్టర్లు థర్డ్ పార్టీకి అప్పగించి పనులు పూర్తి చేసి బిల్లు తీసుకుని చేతులు దులుపుకున్నారు. కాగా రెండేళ్ల పాటు భారీ వర్షాలు లేకపోవడంతో లోపాలు బయట పడలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయాబీ బండారం బయటపడింది. ఒక్కసారిగా అండర్ పాస్‌లోకి నీరు చేరడంతో వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. 36 గంటల పాటు అండర్ పాస్‌లో ప్రయాణం చేయడం కష్టంగా మారింది. ప్రజలు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

100 గ్రామాలకు ప్రధాన మార్గం

తుని పట్టణంతో పాటు రూరల్ మండలం, రౌతులపూడి మండలాలకు చెందిన 100 గ్రామాలకు తాళ్లూరు రైల్వే గేటు ప్రధాన మార్గం. రెండు రైల్వే లైన్లు ఉండడంతో రైలు వస్తే చాలు అరగంట సమయం గేటు మూసి ఉండేది. దీంతో ఎంతో మంది అత్యవసర పనులు, వైద్య సేవలు కోసం వచ్చి ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చేది. అప్పటి ప్రభుత్వాలు ప్రజల సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత జోక్యం చేసుకుని రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చారు. కేంద్రం రూ.4.88 కోట్లు ఇస్తే, రాష్ట్రం నుంచి మ్యాచింగ్ గ్రాంటుగా రూ.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. రెండేళ్ల పాటు నిర్మాణ పనులు జరిగాయి. 2022లో రైల్వే అండర్ పాసును ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రజలకు రవాణా సౌకర్యం సులభతరమైంది.

నిర్వహణ ప్రైవేటు సంస్థకు అప్పగింత

రైల్వే అండర్ పాస్ నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. కాగా వర్షం నీరు అండర్ పాస్‌లోకి చేరితే విద్యుత్ పంపు సాయంతో బయటకు తోడాలి. గత వారంరోజులుగా కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు అండర్ పాస్‌లోకి చేరింది. దీంతో వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అధికారులు వర్షం నీరు పోవడానికి తగిన మార్గం చూపలేదు. దీంతో పాటు అండర్ పాస్ నుంచి గెడ్డబీడు వరకు కాలువ నిర్మాణం చేయాలి. ఇది కూడా చేయలేదు. దీంతో సమస్య తలెత్తుతోంది.

నీరు పోవడానికి చర్యలు

గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం నిర్వహణ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు అండర్ పాస్‌లోకి చేరింది. నీరు పంపింగ్ చేయడానికి ఏర్పాటు చేసిన మోటారు పని చేయలేదు. దీంతో నీరు భారీగా నిలిచిపోయి ప్రజలకు ఇబ్బంది కలిగింది. నేను ఇటీవల బాధ్యతలు తీసుకున్నాను. నిలిచిపోయిన నీటిని ఆయిల్ ఇంజిన్ల ద్వారా బయటకు పంపుతున్నాం. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

–సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఐఏవోడబ్ల్యూ, తుని

రెండు రోజుల నుంచి ఇక్కట్లు

రైల్వే ట్రాక్ ఆవతల ఉన్న 100 గ్రామాల ప్రజలు రెండు రోజుల పాటు ఇబ్బందులు పడ్డారు. అండర్ పాస్‌లో నీరు చేరడంతో వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగింది. దీంతో తుని పట్టణంలోకి రావాలంటే 3 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. అండర్ పాస్ నిర్మించినా వర్షం నీరు పోవడానికి ఏర్పాట్లు చేయలేదు. ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చించినా అధికారుల నిర్లక్ష్యం వలన వరద నీటి సమస్యకు పరిష్కారం లభించలేదు.

–ఆవుల సుబ్బారావు, రైతు, తుని మండలం